అడల్ట్స్ ఓన్లీ కథ A

# 'ఉపవాసం

కె.కె. భాగ్యశ్రీ

''ప్రియా...'' వెనుదిరిగి పడుకున్న ప్రియంవద వీపు మధ్యగా ఉన్న సన్నని పొడవాటి లోయలో మునివేళ్లతో విహారాలు చేస్తూ పిలిచాడు నిశ్చల్.

''ఊ...'' మంద్రస్వరంతో పలికింది ప్రియంవద.

''ఇటు తిరుగు...'' ఆమెను తనవైపు తిప్పుకునే ప్రయత్నంలో సఫలీకృతుడైనాడు నిశ్చల్.

నెమ్మదిగా అతనికి అభిముఖంగా తిరుగుతూ ''ఎందుకో చెప్పండి'' అంది ప్రియంవద.

నునుసిగ్గు దోబూచులాడుతున్న ఆమె వదనారవిందం ముగ్ధమోహనంగా ఉంది.

''ఎందుకో నీకు తెలియదా!'' కొంటెతనం చిందులేసింది అతని మాటలలో.

''ఎందుకు తెలియదు! అస్తమానం నన్నంటిపెట్టుకుని ఉండటం తప్ప... మీకింకేం పనుంది గనక? అయినా ఇరవై నాలుగ్గంటలూ నన్నే అతుక్కుని ఉంటే చూసినవాళ్లేం అనుకుంటారు?'' చిరుకోపంగా అంది ప్రియంవద.

ఆమె ముఖాన్ని కమలం అనుకొని భ్రమపడిన భ్రమరాల్లా ఆమె నుదుటి మీద అల్లల్లాడుతున్న నల్లని ముంగురుల్తో ఆడుకుంటూ-

''అనుకోవడానికి ఇక్కడెవరున్నారూ? ఓహో! చెట్టుమీద అరముగ్గిన జామకాయని కొరుక్కుతింటున్న చిలకమ్మా.. లేలేత మామిడి చిగుళ్లను కడుపారా మెక్కి కూతలు కూస్తున్న కోకిలమ్మా.. చిన్నగా వీచి మన శరీరాల్ని నిమురుతున్న పిల్లగాలీ.. ఆకు కనిపించకుండా నిండుగా విరబూసిన మల్లెతీగా.. ఇవన్నీ ఊసులు వేసుకొని ఏమన్నా అనుకుంటాయని భయమా!'' అన్నాడు నిశ్చల్ ఆమె చెవిని మునిపంటితో సుతారంగా కొరుకుతూ.

ప్రియంవద మోము ఎరుపెక్కింది, సందెవేళలో కుంకుమారబోసినట్లున్న ఆకాశంలా.

''మీకంతా వేళాకోళమే... నేనంటున్నది వాటిగురించి కాదు. మన రమణ, మంగ గురించి. వాళ్లు చూస్తే ఏమనుకుంటారు? అమ్మగారు, అయ్యగారిని కొంగున ముడేసుకుందని అనుకోరూ..'' అనుమానాన్ని వ్యక్తపరుస్తూ నిష్ఠూరంగా అంది ప్రియంవద.

''కొంగున ముడేసుకున్నది సాక్షాత్తూ నీ మొగుడ్నేగా.. అనుకోనీ..'' సన్నని ఆమె నడుం మీద ముడుతని తన వ్రేళ్లతో సవరించాడీసారి.

మత్తుగా మూలిగింది ప్రియంవద. ఆమె వదనంలో పరుచుకున్న మైమరపు.. అదురుతున్న క్రింది పెదవీ.. చిన్నగా కంపిస్తున్న తనూలతిక.. అరమోడ్పులైన కలువ కన్నులూ.. ఇవన్నీ సయ్యాటకి సిద్ధమేనని సంకేతాలు పంపాయి.

శృంగార నాయికలా



కులుకులొలికిస్తున్న అర్ధాంగిని ముద్దులతో ముంచెత్తుతూ ఆమెని అల్లుకున్నాడు నిశ్చల్.

★ ★ ★

"దబ్..."

ఉలిక్కిపడింది ప్రియంవద ఆ శబ్దానికి. చుట్టూ చూసింది ఒక్కసారి.

అంతసేపూ తానున్నది కలల ప్రపంచంలోనని తెలియగానే ఎంతో నిరాశగా అనిపించింది ఆమెకు.

"హు.. ఇదంతా కలా.. నిజమైతే ఎంత బాగుణ్ణు!" కన్నీళ్లు వరదల్లే పొంగుకొచ్చాయి ఒక్కసారిగా.

"ఇంతకీ ఆ శబ్దం ఏమిటి? పాడుపిల్లి.. పాలు తిరగబోసినట్లుంది.." అనుకుంటూ వంటింట్లోకి వెళ్లింది ప్రియంవద.

ఆమె అనుమానం నిజమే. రెండు లీటర్ల పాలున్న గిన్నెని కిచెన్ గట్టు మీద నుండి తిరగదోసి.. నాలుకతో తాగుతోంది నల్లమచ్చలున్న తెల్లగండుపిల్లి.

"ఛూత్..ఛూత్.." అని దాన్ని అదిలిస్తూ దీనికి బాగా అలవాటైంది. చిక్కటి పాలు త్రాగడం మరిగి ఇల్లు పట్టేసింది అనుకొంది అక్కసుగా.

పాలన్నీ నేలమీద ఒలికి గచ్చుని పాలసముద్రం చేసి పారేశాయి.

"మంగా..మంగా.." ఎవరూ పలక లేదు.

"ఈ మంగొకర్తి! క్షణాల్లో మాయమైపోతుంది" విసుక్కుంటూ మంగ కోసమని అవతలకి వెళ్లింది ప్రియంవద.

అది...ఇరవై ఎకరాల సుక్షేత్రం నడుమ కట్టించిన ఫార్మ్‌హౌస్. ఇంటి చుట్టూ ఉన్న పూలతోట.. వివిధ వర్ణాల పుష్పాలతో చూపరులకి కనువిందు చేస్తోంది.

అది దాటి బయటకొస్తే.. చుట్టూ కనుచూపు మేరలో పరుచుకున్న పచ్చని చేలు.. ఒకవైపుగా నిండా కాయలతో దిష్టికొట్టేట్లుగా ఉన్న మామిడి తోట.. ఎటుచూసినా హరిత వర్ణం అలదుకొని నాట్యం చేస్తున్నట్లున్నాయి ఆ పరిసరాలు.

అక్కడక్కడ పావురాళ్లు కువ కువమంటూ ధాన్యం గింజలు ముక్కుతో పొడుచుకు తింటున్నాయి. బుజ్జి, బుజ్జి కుందేలు పిల్లలు ఛెంగు ఛెంగున అటు ఇటు పరుగులు దీస్తూ పచ్చికను కొరుక్కుతింటున్నాయి మధ్య మధ్యన.

"మంగా..మంగా.." ఎంత పిలిచినా ఆమె పలకకపోతే.. పంపు షెడ్ వైపు వెళ్లింది ప్రియంవద ఆమెను వెతుక్కుంటూ.

పెద్దధారతో "దబ..దబ" మని పడుతున్న పంపు నీరు కాలువల గుండా పొలంలోకి మళ్లుతోంది. పంపు షెడ్ ప్రక్కనున్న అవుట్ హౌస్‌లోంచి ఏవో మాటలు వినిపిస్తున్నాయి. మంగ, రమణలు కాపురముండేది అందులోనే.

"మంగా.." మళ్లీ పిలువబోయి ఆగిపోయింది ప్రియంవద హఠాత్తుగా.

"అబ్బ! ఉండు మావా.. ఎప్పుడు సూసినా అదే దేసా.. అమ్మగారు ఇంట్లో ఒక్కరూ ఉన్నారు. నానక్కడ నేకపోతే ఆరేటనుకుంటారూ..." లోపల రమణ బలమైన కౌగిట్లో కువ కువలాడుతున్న మంగ అంది.

"ఆయమ్మేటి అనుకోదులేయే.. ఆవిడకి మాతరం తెల్దేటి? కొత్తగా మనువాడుకున్న మొగుడూ.. పెళ్లాలెట్టా ఉంటారో.. కూత్తంత సందు దొరికినా కుసీ సేసుకోవడం మామూలే గదా.." అన్నాడు రమణ.

ఆ మాటలకు ముఖం అదోలా పెడుతూ "ఆ..ఏం కుసీలే మావా.. అయ్యగోరెప్పుడూ నాటకాలంటూ ఊళ్లమ్మట తిరుగుతారు. ఆయమ్మేమో.. ఉసూరుమంటూ ఇంటికాడే దిగాలుగా కూసుంటుంది. అయినా మావా.. నాకు తెలవకడుగుతాను.. అయ్యగోరావిడని నచ్చుకొనే మనవాడాడంటావా?" సందేహం వ్యక్తపరిచింది మంగ.

"అయ్యన్నీ మనకెందుకే... పెద్దోళ్ల యవ్వారాలు... కావలసినంత జీతం ఇత్తూ మనల్ని కన్నబిడ్డల్లా సూసుకుంటున్నారు. మిగిలినయన్నీ మనకనోసరం... అయినా ఎదురుగుండా ఉన్న మొగుణ్ణొగ్గేసి... అల్లగురించి ఆలోసనేటే నీకూ..."

ఏదో చిలిపి పని చేసినట్లున్నాడు రమణ...కిలకిల నవ్వుతోంది మంగ.

ఒళ్లంతా కంపించింది ప్రియంవదకి. ఏదో మైకం కమ్మినట్లుగా తూలుకుంటూ వచ్చి మంచానికి అడ్డంగా పడి మౌనంగా రోదించసాగింది.

ఆమె అనుభవిస్తున్న మనఃసంక్షోభం అంతా కన్నీటి రూపంలో కాలువలై పారుతోంది ఆమె కన్నుల వెంట.

"నంది నాటకోత్సవాలు" చూసొస్తానని వారం క్రితమే హైదరాబాద్ వెళ్లిపోయిన నిశ్చల్‌ని తలుచుకుంటే... ద్విగుణీకృతమైంది ఆమె దుఃఖం.

అసలేంటి తనలో లోపం!? ఏమీ లేదే!

అందగత్తె అనిపించుకోదగిన అన్ని లక్షణాలూ పుష్కలంగా ఉన్నాయి. ఉత్తమ ఇల్లాలిలా.. ఎంతో అణకువగా నడుచుకుంటోంది అతడికి అనుగుణంగా.

అయినా సరే... అర్ధాంగిగా ఏదో అసంతృప్తికి లోనవుతూనే ఉంది.

నిశ్చల్‌కి తనంటే ప్రాణం... ఏరి కోరి తననే వరించాడు.

తాను కూడా అతడిని ఎంతో ఇష్టపడి పెళ్లాడింది. రెండు మూడు సంబంధాలు... మంచి ఉద్యోగస్తులని వచ్చినా.. నిశ్చల్‌ని పెళ్లాడేందుకే మొగ్గు చూపింది.

అగ్రికల్చరల్ బి.ఎస్.సి. చదివి... ఆధునిక పద్ధతుల ద్వారా వ్యవసాయాన్ని అభివృద్ధి చేసుకొని తాతలనాటి రెండెకరాల పొలాన్ని ఇరవై ఎకరాలకు విస్తరిం



## కాంతిపుంజం

కళ్లతో వేయికాంతులు వెదజల్లే సెలీనాజైట్లీ అందం విషయంలో ఎంతో శ్రద్ధ తీసుకుంటుంది. 'నాకు చిన్నప్పటినుంచీ అందంగా తయారుకావడం అంటే ఎంతో ఇష్టం. గౌన్లు, చుడీదార్లు లాంటి ఫ్యాషన్ దుస్తులతో పాటూ చీరలు కూడా ధరిస్తాను. అయితే ఇలా కన్పించడం చాలా అరుదు. నేనే దుస్తులు వేసుకున్నా చాలా సెక్సీగా ఉంటానంటారంతా. జ్యూయలరీ అంతగా వేసుకోను. నా నైట్ వేర్ చాలా సింపుల్‌గా ఉంటుంది' అని చెప్పే సెలీనా తన బాయ్‌ఫ్రెండ్ నించి దొంగిలించిన టీషర్ట్‌ని రోజూ రాత్రి టైంలో ఎంతోకొంత సేపు కట్టుకుంటుందిట. అతని జ్ఞాపకం కోసమేమో!

పజేసిన ఘనుడు నిశ్చల్.

అయిన వాళ్లందరూ 'పల్లెటూరి గబ్బిలాయి'ని పెళ్లాడడమేంటి? అంటూ అవహేళన చేసినా సరే. అతడి చూపులు.. తానతనికి తొలుచూపులోనే నచ్చిందని తెలియజెప్తున్న ముఖకవళికలు.. తననెంతగానో ఆకట్టుకోవడంతో రెండో ఆలోచన లేకుండా నిశ్చల్‌తో పెళ్లికి 'సై' అంది.

ప్రశాంతమైన వాతావరణంలో పచ్చని ప్రకృతి ఒడిలో.. అన్ని హంగులతో, సౌకర్యాలతో కట్టిన ఈ ఫార్మ్‌హౌస్‌లో కాలుమోపిన తొలినాడు తన అదృష్టానికి ఎంతో పొంగిపోయింది ప్రియంవద.

కాని నాలుగు రోజులు గడిచాక ఆమెకు అర్థమైంది తనకన్నా ముందు నిశ్చల్‌ని లోబరుచుకున్న ప్రీతిపాత్రమైన అంశం మరొకటుందని.

అదే..నాటకం...అవును! నిశ్చల్‌కి నాటకాలంటే ప్రాణం.

చుట్టుపక్కల ఊళ్లలో ఎక్కడే నాటకం ప్రదర్శించినా ముందు వరుసలో కూర్చుని చూడకపోతే అతడికి నిద్ర పట్టదారోజు. అయితే అతడి సరదా కేవలం నాటకం చూడ్డంతో తీరిపోదు. అంతకు ముందు వాళ్లు వేస్తున్న రిహార్సల్స్‌లో కూడా పాల్గొని తగు రీతిలో సలహాలిస్తూ సంబరపడిపోతాడు.

పగలంతా పనివారితో సమానంగా యంత్రంలా పనిచేసి అలసిపోయిన అతడి మనసుని సేదతీర్చగలిగేది.. ఆ నాటకమొక్కటే కాబోలు అని సరిపెట్టుకుంది మొదట్లో. కానీ నాటకం పట్ల అతడికున్న అభిమానం సాధారణం కాదని... అదొక ముదిరిపోయిన వ్యసనమని తెలుసుకుంది రాను రాను.

పొలం పనులు పూర్తవ్వగానే చక్కగా స్నానం చేసి ఇస్త్రీ బట్టలు వేసుకొని గుమ్మెత్తించే అత్తరు పూసుకొని పూలరంగడిలా తయారై బండి బయటకు తీస్తుంటే తనని ఎక్కడికో బయటకు తీసుకెళ్లాడని మురిసిపోయింది మొదట్లో ఒకనాడు.

కానీ అతడు ''ఇవాళ నెల్లిమర్లలో 'గయోపాఖ్యానం' నాటకం ఉంది. గరివిడి ట్రూపువాళ్లు ఆడతారట. చూసొస్తా'' అని మరోమాటకు తావివ్వకుండా రఘామ్మని దూసుకుపోయాడు తన మోటార్ బైక్ మీద.

ఖిన్నురాలై.. రాతి ప్రతిమలా నిలబడడం తనవంతైంది.

అలా వెళ్లిన మనిషి రాత్రి పన్నెండింటిదాకా పత్తా లేడు. మూసుకుపోయిన కనురెప్పలను బలవంతంగా తెరుచుకొని అతడికోసం ఆతృతగా నిరీక్షిస్తున్న భార్యను చూసి ''చూడు ప్రియా... నాకోసం నువ్వు నిద్రాహారాలు మాని ఎదురుచూడనక్కరలేదు. నేను పెట్టుకు తినగలను... నువ్వు హాయిగా పడుకో...'' అనేశాడు పుటుక్కున.

జలపాతాల రీతిలో ముందుకు దూకాయి కన్నీళ్లు ఆమెకు.

అభోజనంగానే పడుకుంది ఆ రాత్రి. కడుపాకలి తీరిన అతడు ఇంకొక రకం ఆకలి తీర్చుకునేందుకు మీద చేయివేశాడు. అంతా యాంత్రికం... ఆ కలయికలో ఎటువంటి మధుర స్పందనలు కలుగలేదు. ఏ విధమైన పులకింతలు రేగలేదు.

ముందు వెనుకలు ఎవరూ లేని నిశ్చల్‌ని పెళ్లాడి... అతడి జీవితాన్ని మహారాణియై ఏలాలని తపించిన ప్రియంవద కలలు కల్లలైనాయి.

ఎవరూ లేని ఏకాంతంలో యధేచ్ఛగా ప్రణయ సామ్రాజ్యాన్ని స్థాపించుకోవచ్చని ఆరాటపడిన ఆమె ఎంతో నిస్పృహకు లోనైంది తన కోరిక నెరవేరకపోవడంతో.

పొలంలో అతడు పనిచే(యి)స్తుంటే వెళ్లి అతడి నుదుట పట్టిన స్వేదాన్ని తన పైటకొంగుతో అద్దాలని... అలిసిపోయి ఇంటికి వచ్చిన తరువాత వేడి వేడి నీళ్లతో స్నానం చేయిస్తూ విశాలమైన అతడి వీపుమీద ముగ్గులు వేయాలని ఎన్నో సుందరస్వప్నాలు.

కానీ...అతడందుకు వ్యతిరేకం. ఏ పనికీ భార్య మీద ఆధారపడడు.

ఓసారి పొలంలో పనివారిపై అజమాయిషీ చేస్తూ పనులు పురమాయిస్తున్న సమయంలో ప్రియంవద వెళ్లి అతడి సరసనే నిలుచుంది.

ఆమె రాకని గమనించిన అతడు చేస్తున్న పని మీద నుంచి దృష్టి మరల్చకుండానే..

''ఏంటి ప్రియా... ఇలా వచ్చావు? తోచకపోతే ఇంట్లో బోలెడు సినిమా సి.డి.లున్నాయి కదా! వేసుకొని చూడు. ఈ ఎండలో ఇక్కడకి రావడం దేనికి?'' అన్నాడు నిశ్చల్ పాలపొంగులాంటి ఆమె ఉత్సాహంపై నీళ్లు చిలకరించుతూ.

అంతే.. మరెన్నడూ అలా పోలేదు.

అతడికి తన బాధ అర్థమయ్యేలా ఎలా తెలియజేయాలో తోచలేదు ఆమెకు. అసలు అతడితో మనసువిప్పి మాట్లాడే సమయమే లభించడం లేదు.

పనంతసేపూ పని... ఆ తరువాత నాటకాలు... ఇదే గోల.

అర్థాంగి అభిరుచుల గురించి.. అసంతృప్తిని గురించీ పట్టించుకునే తీరికే లేదు నిశ్చల్‌కి.

''అమ్మగోరూ... పాలు పిల్లి తోసేసినాదేటండి.. వేడిగా ఉన్నాయని ఫ్రిజ్జులో ఎట్టడం మానేసి అలా యెల్లాను. ఈ లోపు ఈ మాయదారి పిల్లి ఇట్టా సేత్తుందనుకోలేదు'' నుదుట పట్టిన చిరుచెమటలు తుడుచుకుంటూ అంది మంగ.

దాని మాటలతో ఈ లోకంలోకి వచ్చిపడింది ప్రియంవద. మంగ ముఖంకేసి తేరిపార చూసింది.

## డయానా హావా

**కొన్ని చిత్రాలు కెరీర్‌లో కలికితురాయిగా నిలిచిపోతాయి. మాజీ అందాల సుందరి డయానా హైడెన్ కూడా ఇప్పుడిలాగే అంటోంది. 'కొన్ని సినిమాల్లో నా పాత్రల గురించి నేనెంతో శ్రద్ధ తీసుకుంటాను. కొన్ని ఇంటిమేట్ సీన్స్‌లో నా అంకితభావం అంతా ఇంతా కాదని అంతా అంటారు. అందుకేనేమో నేను కోరుకునే పాత్రలు నన్ను వెదుక్కుంటూ వస్తుంటాయి' అని ఆనందంగా చెబుతోంది డయానా హెడెన్. అన్నట్టు జిస్మ్, ఖ్వాహిష్, హవాస్, మర్డర్ చిత్రాల్లో కొన్ని డేర్ అండ్ డ్యాషింగ్ సీన్స్‌లో ఆమె జంకుబొంకు లేకుండా నటించిందని అంటున్నారు.**



దాని ముఖంలో ఏదో వెలుగు... బొట్టు చెదిరి... జుట్టు రేగి వింత అందంతో కళకళలాడిపోతోంది నల్ల కలువలాంటి ఆమె ముఖం.

''సరేగానీ... వంటిల్లు శుభ్రం చేయి...'' అంది ప్రియంవదం అసూయగా దాన్నే చూస్తూ.

★ ★ ★

''ఇదిగో ప్రియా... పట్టుచీరా... ముత్యాల సెట్టూ తీసుకొచ్చాను నీకోసం...'' సూట్‌కేస్‌లోంచి పేకెట్స్ తీసి అందించాడు నిశ్చల్.

పేకెట్ విప్పి చూసింది ప్రియంవద. చిలకపచ్చ రంగు మీద నిండా జరీ పనితనంతో మిలమిల మెరిసిపోతోంది పట్టుచీర.

''ఎందుకండీ ఇప్పుడు? పెళ్ళికి కొన్న చీరల్లోనే కట్టనివి చాలా ఉన్నాయి'' అంది ప్రియంవద పట్టుచీరను చేత్తో పట్టి చూస్తూ.

''తేవాలనిపించింది తెచ్చాను. అయినా మనకేం లేదా...పోదా...! మహారాణిలా అన్నీ అనుభవించు..'' అంటూ బాత్‌రూమ్‌లోకి వెళ్ళిపోయాడు నిశ్చల్ టవల్ తీసుకొని.

''హు..మహారాణిలా.. అన్నీ అనుభవించాలట... కట్టుకోవడానికి చీని చీనాంబరాలు, పెట్టుకోవడానికి నవరత్న ఖచిత ఆభరణాలు ఉంటే చాలునా! ఇవన్నీ ఈ శరీరాన్ని సింగారించుకునేందుకే... కానీ మనసును అలంకరించుకునేందుకు కనీసం ఒక్కటంటే ఒక్కటి... మధురానుభూతి అయినా మిగిలిందా! పరిపూర్ణమైన ఆనందంతో హృదయం నిండి పరవళ్లు తొక్కడానికి కావల్సిన దానిగురించి ఆలోచించడేం?

అప్రయత్నంగా మంగ గుర్తొచ్చింది. సతివాడ సంతలో కొన్న నల్లపూసల దండా.. తాను దయదలచి ఇచ్చిన పాత పాలియస్టర్ చీరా... తప్పితే దాని వంటిమీద వేరే ఆభరణముండదు. అయినా నేరేడుపళ్లలాంటి దాని కళ్లలో సంతృప్తి తొణికిసలాడుతూ ఉంటుంది. ఆ మెరుపు ఎందువలన వచ్చిందో తనకు తెలియనిది కాదు.

మనసైన చెలికాడితో.. తీపి అనుభవాలు పంచుకున్న సంతోషం అదంతా. అందుకే దాని ముఖంలో ఎప్పుడూ చెరగని చిరునవ్వు కొలువై ఉంటుంది.

హుషారుగా.. ఏవో ఛలోక్తులు విసురుకుంటూ... వీడకుండా తిరుగుతారు ఆలుమగలు.

తనూ ఉంది... ఎందుకూ! శృంగారసుఖాన్ని ఏనాడైనా మనసారా... స్వేచ్ఛగా అనుభవించిందా! తనకైతే అది... మూడే మూడు నిమిషాల్లో ముగిసిపోయే మొక్కుబడి తంతు.

మబ్బులు విడివడి... మనసులు ముడివడి... దాంపత్య సుఖాన్ని మదితీరా జుర్రుకొనే మంచి తరుణమెన్నడో తన జీవితాన...

బాధగా మూల్గింది ప్రియంవద మనసు.

నిశ్చల్ భోజనం చేయడం ముగించి పొలంవైపు వెళ్లాడు. మంగని కేకేసి అన్నం కూరలు అన్నీ తీసుకెళ్లమని చెప్పింది. ఎందుకో... కోపంతో ధుమధుమలాడుతోంది మంగ.

పెరటి వసారాలో ఆకువేసి ప్రియంవద ఇచ్చిన పదార్థాలను వడ్డించి... ఆవురావురుమని తింటున్న రమణకి చీరచెంగుతో విసురుతోంది మంగ.

వంటింట్లో నిలబడినా ప్రియంవద చెవులు, వారు చేస్తున్న సంభాషణను ఆలకించాలనే ఆసక్తితో ఉన్నాయి.

''ఏటి మావా! ఈ పనులు.. సీట్లపేకాడ్డం మన ఇంటావంటా ఎక్కడైనా ఉందా... ఇల్లు గుల్లవ్వడం తప్ప మరేటీ నేదందులో.. ఉంకోపాలి నువ్వా పేకముక్కలు ముట్టుకున్నావని తెలిసిందో.. పత్తు పెట్టి సంపుతా...ఆ...'' మొగుడితో పోట్లాటకి దిగింది మంగ.

''అంత శిచ్చేయకే మంగా... ఆ పత్తులు నాను తట్టుకోలేనే... నీక్కోపమొస్తే నాలుగు తిట్టు... నేదంటే కొట్టు.. అంతేగానీ... ఉపోసాలెట్టి నన్నెండగట్టకే.. మరెప్పుడూ ఆ పాడు పేకాట ఆడనంటున్నాగా... నీమీదొట్టు...'' బతిమలాడుతున్నాడు రమణ.

''అట్టా రా దారికి.. సెడలవాట్లు సేసుకోవడం ఈజీనే... కానీ మానడం అంత సులువు కాదు...'' అంటోంది మంగ.

వారి సంభాషణను వింటున్న ప్రియంవదకి మెరుపులా ఏదో తట్టింది.

''ఉపవాసం'' ఆ ... అదే... అదే తను అతడి మీద ప్రయోగించవలసిన ఆయుధం.

నాటకాల పేరుతో ఊళ్లన్నీ తిరిగొస్తున్నా... ఇంటి దగ్గర అతడికి కావలసినవి హాయిగా అమరిపోవడంతో ఇల్లాలి విలువ అతడికి తెలియడం లేదు.

ఒక వారం.. కేవలం ఒకే ఒక్క వారం... అతడిని అన్ని రకాలుగా పస్తులుంచి చూస్తే.. ఆ.. ఖచ్చితంగా తన దారికి దిగొస్తాడు. అప్పుడు తను విధించవలసిన షరతులు విధించి అతడిని ఆ నాటకాల పిచ్చి నుండి బయటపడేయవచ్చు.

తను కావాలో.. ఆ నాటకం కావాలో తేల్చుకోమంటుంది.. అతడేం చేస్తాడో అప్పుడే తేలిపోతుంది.

ఈ ఆలోచన రాగానే ప్రియంవద మనసులో విచారమంతా తాత్కాలికంగా తుడిచిపెట్టుకుపోయి.. కొత్త ఉత్సాహం పొంగుకొచ్చింది.

★ ★ ★


''బావా ఎప్పుడు వచ్చితీవు...'' స్నానం చేస్తూనే... పడక సీనులో పద్యాలు రాగయుక్తంగా పాడేసుకుంటున్నాడు నిశ్చల్.

అతడు పడక గదిలోకి వచ్చేంతవరకు ఓపిగ్గా ఎదురుచూసింది ప్రియంవద.

''రేపు నేను మా వాళ్లింటికి వెళ్లాలనుకుంటున్నాను...'' చెప్పింది నిర్లిప్తంగా.

## దైవానుగ్రహం

**'జీవితంలో ముందుకి సాగాలంటే మన కృషి, పట్టుదల, ప్రణాళికతో పాటూ దైవానుగ్రహం కూడా కావాలి అంటోంది రవీనాటాండన్. అన్నట్టు ప్రేమ కూడా దేవుడు మనకిచ్చిన వరం లాంటిది. అది దేవుడు ప్రతి ఒక్కరికి ఇచ్చే బహుమతి. దాన్ని పాడుచేసుకోకూడదు' అంటోంది రవీనా. వస్తువుని సరిగా ఉపయోగించుకుంటే దాని ద్వారా మనకి మంచి ప్రయోజనం సిద్ధిస్తుంది. దాన్ని వృథా చేస్తే దాని ద్వారా వచ్చే ప్రయోజనం మనకు దూరమవుతుంది. అలాగే ప్రేమ కూడా' అంటూ ఓ లెక్చరర్‌గా ప్రేమ పాఠాలు చెబుతోంది.**



''ఓ... - మీ అమ్మ, నాన్నలని చూడాలనుందా...వెళ్లు.. రమణ దిగబెడతాడులే...'' ఇంకొక మాటకి తావివ్వకుండా ఆమెను కౌగిలించుకున్నాడు నిశ్చల్.

అసహనంగా కదిలింది ప్రియంవద. తాను పుట్టింటికి వెళ్తానని చెప్తే ఇతడికే రకమైన ఫీలింగ్ కలుగలేదా... కొత్తగా పెళ్లాడిన పడుచు పెళ్లాం తనను విడిచి దూరంగా వెళ్తానంటే 'విరహం' లాంటి అనుభూతి ఏదీ జనించలేదా అతడిలో? ఒకవేళ కలిగినా బయటపడకుండా నటిస్తున్నాడా! ఇప్పుడిలాగే అంటాడు కానీ... నాలుగు రోజుల పాటు తను అతడి సమక్షంలో లేకుంటే... అప్పుడు బయటపడుతుంది అతడి సంగతి.

తనంటే ఎంత ప్రేమ ఉందో తెలిసిపోతుంది.

భర్త కౌగిట్లో అన్యమనస్కంగానే కరగసాగింది ప్రియంవద.

★ ★ ★

''ఒసేయ్ సుశీలా.. నేనలా శివాలయానికి వెళ్లివస్తానే..'' కోడలితో చెప్పి బయలుదేరింది సుందరమ్మ.

''ఉండు బామ్మా.. నేనూ వస్తాను'' జడ అల్లుకోవడం ముగించిన ప్రియంవద అంది. అప్పటికి ఆమె వచ్చి ఆరు రోజులయ్యింది.

సుందరమ్మ నొసలు ముడివడింది మనుమరాలి మాటలకు. మస్తిష్కంలో ఏదో అనుమానం పొడసూపింది. అంతలోనే సర్దుకొని ''సరే రా...'' అంది.

బామ్మతో కలిసి శివాలయానికి వెళ్లింది ప్రియంవద.

ఆ రోజు అక్కడ ఎవరో పంతులుగారు 'శివరాత్రి మహాత్యం' గురించి పురాణ ప్రవచనం చెపుతున్నారు. భక్తులందరూ ఎంతో శ్రద్ధగా వింటున్నారు.

''శివరాత్రి నాడు... ఎంతో శుచి, శుభ్రతలతో శివనామస్మరణం చేస్తూ.. రాత్రంతా జాగరణ చేయడం వలన మానవుడు తాను చేసిన సకల పాపాల నుండి విముక్తుడవుతాడు... పూర్వం...'' ఆయన ప్రసంగానికి అడ్డుపడ్డాడో వృద్ధ భక్తుడు.

''పంతులుగారూ...నాదొక చిన్న సందేహం. జాగారంతో పాటు 'ఉపవాసం' చేస్తే ఫలితమెక్కువగా ఉంటుందంటారు. అది నిజమేనా!'' అంటూ ప్రశ్నించాడు.

పంతులుగారు చిన్నగా నవ్వారు. ''భగవంతుడి పేరిట నిరాహారముండమని ఏ గ్రంథంలోనూ రాయలేదు నాయనా... ఇవన్నీ మనకు మనంగా ఏర్పరచుకున్న ఆచార వ్యవహారాలు. అసలు 'ఉపవాసం' అంటే అర్థం తెలుసా?... 'ఉప' అంటే సమీపంలో, 'వాసం' అంటే నివశించమని. మనసు నిండా భగవంతుడి దివ్యమంగళ విగ్రహాన్ని ప్రతిష్ఠింపజేసుకొని... త్రికరణ శుద్ధిగా ఆయన్ను సేవిస్తూ... ఆయన సమీపంలో గడపడమే ఉపవాసమంటే. అంతేగాని కడుపు మాడ్చుకొని ఆరారా కాఫీలో... టీవీలో... సేవిస్తూ.. రాత్రంతా టీవీలో వచ్చే చెత్త సీరియల్స్, సినిమాలు చూస్తూ కాలక్షేపం చేస్తే అది జాగరణ అనిపించుకోదు. స్వచ్ఛమైన మనసుతో తనను ఆరాధించి, అర్చించినవాడిని తప్పక కరుణిస్తాడు పరమేశ్వరుడు.

'ఉపవాసం' పేరిట అభోజనంగా ఉంటే దృష్టంతా 'ఆకలి' మీదే ఉంటుందిగానీ దేముడిపై ఉండదు. అందుకే... కడుపు నిండా తిన్నాసరే... ఆ సర్వాంతర్యామిని భక్తిశ్రద్ధలతో కొలిస్తేనే.. అది నిజమైన ఆరాధన అనిపించుకుంటుంది.''

ఒక ఝురీ ప్రవాహంలా సాగిపోతోంది పంతులుగారి ప్రసంగం.

ఉలిక్కిపడింది ప్రియంవద. ఆ పురాణ కాలక్షేపంలో అన్యాపదేశంగా తనకేదో సందేశం లభించినట్లుగా అనిపించిందామెకి.

రాత్రి భోజనాలైనాక పెరట్లో సన్నజాజి తీగ ప్రక్కన పట్టిమంచం మీద తన ప్రక్కనే పడుకొని నిండుచంద్రుడిని చూస్తూన్న మనవరాలిని ''నువ్వు మీ ఆయన మీద అలిగొచ్చావు కదూ...'' అని అడిగింది సుందరమ్మ.

''అహ... అదీ...'' తడబడింది ప్రియంవద ఏం చెప్పాలో తోచనట్లుగా.

''అమ్మ పుట్టేల్లు మేనమామకెరుక అన్నట్టు నాకా మాత్రం తెలియదనుకోకు. నన్ను దబాయించక నిజమో కాదో చెప్పు...'' ధాటీగా అంది సుందరమ్మ.

దొరికిపోయిన దొంగలా కళ్లు దించుకొని ''అవునుగానీ... నువ్వెలా పోల్చావు బామ్మా'' అడిగింది ప్రియంవద కుతూహలంగా.

''కొత్తగా పెళ్లయిన నీ వయసు ఆడపిల్ల మల్లెల గురించీ, వెన్నెల గురించీ ఆలోచించడం మానేసి, గుళ్లూ గోపురాలంట పురాణ కాలక్షేపాలంటూ తిరిగితే ఆమాత్రం అనుమానం రాదా! ఏమాత్రం ఖాళీ దొరికినా 'మా ఆయనా!' అంటూ శ్రీవారి ముచ్చట్లు ఏకరువు పెడతారు కొత్తపెళ్లికూతుళ్లు. ఆ ఆరాటం నీలో కాగడా పెట్టి వెదికినా కానరావడం లేదు. అందుకే పోల్చాను. ఏమైంది ఇంతకీ?'' అడిగింది సుందరమ్మ లాలనగా ప్రియంవద చుబుకం పట్టుకొని.

కళ్లనీళ్ల పర్యంతమై తన సమస్యను వెల్లడించింది ప్రియంవద.

అంతా విన్నాక ''ఓస్ ఇంతేనా! ఇది చిటికెలో పరిష్కరించుకొనే సమస్య..'' అంది సుందరమ్మ ఆమె కన్నీళ్లను తుడుస్తూ.

''ఎలా?'' అయోమయం నెలకొంది ప్రియంవదలో.

''ఇలా...'' చెప్పడం మొదలుపెట్టింది బామ్మ.

★ ★ ★

నిశ్చల్‌కి చికాగ్గా వుంది. ప్రియంవద పుట్టింటికెళ్లి వారం రోజులైంది. ఇప్పటివరకూ ఏ ఫోన్‌కాలూ రాలేదు. ఆమె ఇంట్లో తిరుగాడుతుంటే నిండుగా వుండేది. మృదుమధురమైన ఆమె పాద మంజీరాల సవ్వడి ఎంతో హాయిగొలిపేది వీనులకు. అలాంటిది ఈ వారం రోజులుగా ఇంట్లో ఏదో నిశ్శబ్దం. దానికి తోడు-

''అయ్యగోరు, అమ్మగారిని సరిగ్గా సూసుకోడం నేదట... నాటకాలంటూ ఊళ్లు పట్టి తిరిగితే... ఆయమ్మకి కోపవొచ్చి పుట్టింటికి పోయినాదంట...'' నిన్న కూలీలు వరినాట్లు వేస్తూ చెవులు కొరుక్కోవడం తన చెవులపడింది యధాలాపంగా.

నిజంగా ప్రియ అందుకే వెళ్లిపోయిందా! అయితే దోషం తనలోనే వుందా! ఏం చేయడం మరి? నాటకమంటే తనకు ఆరోప్రాణం... 'కావ్యేషు నాటకం రమ్యం' అన్నారు. అట్టడుగుకి పోతూన్న నాటక కళను ఉద్ధరించే ప్రయత్నాలు జరుగుతున్నాయి ఇప్పుడిప్పుడే... తనలాంటి అభిమానులు వెళ్లి ప్రదర్శనను తిలకించితే నాటక కళాకారులకు ఎంతో ప్రోత్సాహంగా వుంటుందని... దగ్గర్లో ఎక్కడే నాటకమైనా సరే వెళ్లి చూస్తాడు. కాని ఆ అలవాటు ప్రియాతిప్రియమైన ప్రియను తనకు దూరం చేస్తే...


ఆ ఆలోచనే భరించలేకపోయాడు నిశ్చల్. మనసంతా చేదుగా తయారైంది.

ఇంతలో గుర్రపుడెక్కల సవ్వడి లయబద్ధంగా వినరావడంతో అటువైపుగా చూశాడు. తన కళ్లను తానే నమ్మలేకపోయాడు.

జట్కాబండి దిగి బండివాడికి డబ్బులిస్తోంది ప్రియంవద. ఆమెను చూడగానే ఆనందంతో పిల్లిమొగ్గలు వేసింది నిశ్చల్ మనసు.

''ప్రియా...'' ఎదురుగా వెళ్లి ఆమె చేతిలోని సూట్‌కేస్ అందుకున్నాడు సంబరంగా.

ప్రియంవద ఆశ్చర్యపోయింది... ఎన్నడూ లేనిది నిశ్చల్‌లో ఈ పరవశం



ఏమిటి కొత్తగా?

తనని కనినంతనే ఆ నయనాల్లో విరిసిన వింత మెరుపుని పసిగట్టింది ప్రియంవద.

''వారం రోజులైపోయింది అప్పుడే నువ్వెళ్లి... ఒక్క ఫోనైనా చేయలేదూ...'' అన్నాడు నిశ్చల్ కినుకగా.

విస్మయంగా చూసింది అతడి వైపు. మాట్లాడకుండా అడుగులు వేసింది.

ఆమెతోపాటే ఇంట్లోకి ప్రవేశించి 'మంగా... మంగా...'' అంటూ గావుకేకలు పెట్టాడు నిశ్చల్.

క్షణాల్లో ప్రత్యక్షమైంది మంగ ఛెంగున ఎగురుకుంటూ.

ప్రియంవద రాకకి సంతోషించినట్లుగా దాని ముఖం విప్పారింది.

''అమ్మగారు అలసిపోయి వచ్చారు. స్నానానికి ఏర్పాట్లు చేయి'' అని మంగకు పురమాయించి, ''నువ్వు భోంచేసి రెస్ట్ తీసుకో.. నేను పనిచూసుకు వచ్చేస్తాను..'' నిశ్చల్ చెప్పాడు ప్రియంవదతో ఎంతో ప్రేమగా.

ఆ స్వరంలో...మనుషుల్ని మంత్రముగ్ధుల్ని చేసే వింత లాలన ధ్వనించింది.

స్నానం చేసి, భోంచేసి విశ్రాంతిగా నడుం వాల్చింది ప్రియంవద. ఎంతసేపు నిద్రపోయిందో ఆమెకే తెలియదు.

నిద్రలోంచి మేలుకొనేసరికి బాగా పొద్దుపోయింది. కళ్లు తెరచిన ఆమెకు తననే దీక్షగా చూస్తూ కూర్చున్న భర్త కనిపించాడు.

చటుక్కున లేచి కూర్చొని ''ఎంత సేపైంది మీరు వచ్చి?'' చెదిరిన పైటను సర్దుకుంటూ అడిగింది ప్రియంవద తడబాటుగా.

కరినాగులాంటి జడను గుండెలమీదుగా ముందుకు వేసుకొని, కావ్య నాయికలా మెరిసిపోతున్న అర్ధాంగి వైపు అనురక్తిగా చూశాడు నిశ్చల్.

ఆ చూపులకి అందంగా సిగ్గుపడింది ప్రియంవద. అది ఎంతో ఆహ్లాదాన్ని కలుగజేసింది నిశ్చల్ కనులకు.

''సాయంత్రం ఏదైనా నాటకం ఉందా?'' ప్రియంవద ప్రశ్నలో ఏదైనా వ్యంగ్యం దొర్లిందేమోనని వెదుకులాడాడు నిశ్చల్.

ఆమె మామూలుగానే అడిగిందని గ్రహించి ''ఆ..కొత్తపేటలో ఏదో సాంఘిక నాటకం ఉందట. అయినా నేను వెళ్లనులే...'' అన్నాడు నిశ్చల్.

మంచం దిగి నిలబడుతూ ''అయ్యో వెళ్లరా! నేనింకా మీతో కలసి నాటకం చూడాలని ఆశపడితేనూ..'' అంది ప్రియంవద ఎద మీదున్న జడను వయ్యారంగా వెనక్కి వేసుకుంటూ..

ఆ విసురుకి వాలుజడ చివర వచ్చి నిశ్చల్ చెంపని తాకి ముద్దు పెట్టుకుంది.

అతడు వివశుడైపోయాడు ఒక్కసారిగా.

''నాతో నాటకానికొస్తావా!'' అడిగాడు ఆశ్చర్యంగా.

''ఏం రాకూడదా?'' క్రీగంట చూసింది ప్రియంవద. ఇంత మగాడూ ఆ చూపుకి చిత్తయిపోయాడు. గుండెల్లో ఏవో మన్మథ బాణాలు నాటుకున్నట్లయ్యాయి.

గబగబ తయారై ఇద్దరూ నాటకం చూడడానికి బయలుదేరారు. అతడు తెచ్చిన చిలకపచ్చ చీర ధరించి, మెడలో ముత్యాల హారంతో ప్రియంవద అందానికే అసూయ పుట్టించేట్లుగా ఉంది. బైక్‌మీద వెళ్తూంటే అతడి నానుకొని కూర్చున్న ప్రియంవద కుచోన్నతాలు... వీపుకు హత్తుకొన్నప్పుడల్లా ఏవో వింత వింత ప్రకంపనలు చెలరేగాయి నిశ్చల్‌లో. ఒళ్లంతా ఏదో పులకింత ప్రాకి గిలిగింతలు రేపాయి. నాటకం చూస్తున్నంతసేపూ తన చీరని పెనవేసుకుని కూర్చున్న ప్రియంవద స్పర్శతో ఏదో తాదాత్మ్యం కలిగింది అతడికి.

నాటకం పూర్తయ్యింది. వస్తూ...వస్తూ... హోటల్లో భోంచేసి, స్పెషల్ పాన్ వేసుకొని ఇంటికొచ్చారు.


అప్పటికే మంగ, రమణల నివాసంలోంచి గుసగుసలు వినిపిస్తున్నాయి.

డ్రస్సింగ్ టేబుల్ దగ్గర నిలబడి చీర మార్చుకోవడానికి పైట దగ్గర పిన్ను తీస్తున్న ప్రియంవదను ఆగలేనన్నట్లుగా చుట్టేశాడు నిశ్చల్.

''అయ్యో స్వామీ... ఏమిటా తొందర? కాస్త ఆగండి... చీర నలిగిపోతుంది...'' అంది ప్రియంవద తన ఒంటిపై పారాడుతున్న అతడి చేతులను తోసేస్తూ.

''నీ చీర నలగకుండా చూసే పూచీ నాది'' అని హామీ ఇస్తున్నట్లుగా పట్టుచీరను జాగ్రత్తగా విప్పి పక్కన పెట్టాడతడు పదిలంగా.

అర్ధనిమీలిత నేత్రాలతో, పూలదీవెలా వణికిపోతున్న ప్రియంవద మెత్తని శరీరాన్ని బలంగా అదుముకున్నాడు నిశ్చల్ తనకేసి.




ఇద్దరి మధ్యన మాటలు కరువైనాయి.

ప్రియంవదలో ఇదివరకెన్నాడూ లేని సంతృప్తి...తన్మయత్వం. అనిర్వచనీయమైన అనుభూతులెన్నో చోటు చేసుకున్నాయి ఆ అనురాగ సంగమంలో.

తొలిసారిగా... శృంగార జీవితంలోని మాధుర్యాన్ని చవిచూస్తున్నారు దంపతులిద్దరూ మమేకమై.

ప్రియంవదకి అప్రయత్నంగా బామ్మ గుర్తొచ్చింది.

నిజంగా ఆమె సలహా వలనే తాను భర్తకింత చేరువ వ్వగలిగింది అనుకుంది. ఇంతకీ ఆ రోజు బామ్మ ఏం చెప్పిందంటే-

''ఇందాక గుడిలో పూజారిగారు చెప్పినది విన్నావుగా. 'ఉపవాసం' అంటే సమీపంలో నివశించడమని... నిశ్చలమైన మనసుతో ఆయన్ను పూజిస్తే అనుగ్రహిస్తాడని చెప్పలేదూ... భగవంతుడి ఎడనే దృష్టి కేంద్రీకరించి ఉంటే మనం ఆయన కరుణకి పాత్రులవుతాం... బలవంతంగా తిండి మానేయడం వలన మన దృష్టి మొత్తం 'ఆకలి' పైనే ఉంటుంది. అప్పుడు మనది నిజమైన భక్తి ఎలా అవుతుంది? నీ సంగతీ అంతే.

బలవంతంగా అతడిని పస్తులుపెట్టి నువ్వేమీ సాధించలేవు. పైపెచ్చు అతడు ఇతర విషయాల పట్ల ఆసక్తుడయ్యే అవకాశం నీకు నువ్వుగా కల్పించినట్లవుతుంది.

అలా కాకుండా అతడితో 'ఉప'వాసం చేస్తూ.. నీ ప్రవర్తన ద్వారా ఆకట్టుకోవాలి.

ఎప్పటినుండో నాటకం పట్ల అతడికున్న అభిరుచిని ఒక్కసారిగా దూరం చేయాలంటే కష్టం...

అతడి జీవితంతో పెనవేసుకుపోయిన ఆ అభిరుచిని నువ్వు కూడా పంచుకుంటూ అతడికి దగ్గరయ్యే ప్రయత్నం చేయి.

తన ఇష్టాన్ని భార్య అర్థం చేసుకుందని పొంగిపోతాడు అతడు. నిశ్చలమైన తదేక దీక్షతో అతడిని నువ్వు సేవిస్తే అతడు నీకు దాసానుదాసుడవుతాడు. అప్పుడా నిశ్చలుడు నీ త్రోవకెందుకు రాడో నేనూ చూస్తాను.''

నిజమైన 'ఉపవాసం' అంటే ఏమిటో ఉపదేశించిన బామ్మని గౌరవపూర్వకంగా చూసింది ప్రియంవద.

తన తొందరపాటు వలన జీవితాన్ని నష్టపోకుండా ఆపింది బామ్మ.

''థాంక్యూ బామ్మా! నువ్వు చెప్పిన సలహా పాటించాకే నా జీవితంలో నవవసంతం తొంగిచూసింది'' అనుకుంది ప్రియంవద మగని గాఢ పరిష్వంగంలో కరిగిపోతూ.

☆